క్లుప్తంగా

ఎస్‌బీఐ ట్రెజరీ శాఖ చీఫ్ మేనేజర్‌గా భాస్కర వర్మ


భాస్కర వర్మ,

కర్నూలు(అగ్రికల్చర్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కలెక్టరేట్‌లోని ట్రెజరీ శాఖ మేనేజర్‌గా సీపీ భాస్కర వర్మ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని లోకల్ హెడ్ ఆఫీస్‌లో చీఫ్ మేనేజర్‌గా పని చేస్తూ కర్నూలు కు బదిలీ అయ్యారు. ఈయన స్వస్థలం కర్నూలు. శుక్రవారం ట్రెజరీ శాఖ చీఫ్ మేనేజర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇక్కడ చీఫ్ మేనేజర్‌గా పనిచేస్తున్న సీవీఆర్ ప్రసాద్ అనంతపురానికి బదిలీ అయ్యారు.

యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలి


మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు సిటీ: నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రవీంద్ర మహిళ డిగ్రీ కాలేజీలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేళాలో 16 కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 401 మంది హాజరుకాగా 154 మందికి ఉద్యోగాలు లభించాయి. రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకుడు జి.పుల్లయ్య, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లపై కక్ష తగదు


మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు


కర్నూలు(సెంట్రల్): మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ ద్వారా నిత్యావసర సరుకులను సరఫరా చేస్తున్న ఆపరేటర్లను జూన్ 1 నుంచి తొలగించడం రాజకీయ కక్షపూరితమని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా ప్రజా సేవలో ఉన్న 9220 ఎండీయూ వాహనాల ఆపరేటర్లను తొలగించడం అన్యాయమన్నారు. ఈ వాహనాలపై ఆధారపడి జీవిస్తున్న వారిని రోడ్డుపాలు చేయడం తగదన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకొని ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలని కోరారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం వచ్చాక ఫీల్డ్‌అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన కార్మికులను కూడా తెలగించిందన్నారు. కార్యక్రమంలో కె.ప్రభాకర్, నాగేశ్వరరావు, సాయిబాబా, మార్రేళ్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

మంచి కథలే సినిమాకు సక్సెస్ ఫార్ములా


సమావేశంలో పాల్గొన్న కవులు, రచయితలు

కర్నూలు కల్చరల్: మంచి కథలను సినిమా ఆదరిస్తుందని, అన్నీ కమర్షియల్ అనడం సరి కాదని పోతుగడ్డ సినిమా దర్శకుడు రక్షా వీరం అన్నారు. శుక్రవారం రాత్రి సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలు కథలతో చిట్ చాట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోతుగడ్డకు కథా నేపథ్యం కర్నూలే అన్నారు. సాహిత్యం వల్లనే కథలు పండుతాయని, కథా సాహిత్యం సినిమాకు ఊపిరి లాంటిదన్నారు. సినిమా రంగానికి ఊతమిస్తున్నవి రాయలసీమ కథలే అన్నారు. సభలో కథకులు మారుతి, ఎస్‌డీవీ అజీజ్, తెలకపల్లి మధుసూదన శర్మ, సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంపీ బసవరాజు, కవులు పార్వతయ్య, నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియ్యా, ఏవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కరాటే కిడ్: లెజెండ్స్, భైరవం, సింగిల్, ఖలేజా (2010), మిషన్ ఇంపాజిబుల్ – ది ఫైనల్ రెకనింగ్, ఘటికచలం, ఫైనల్ డెస్టినేషన్ : బ్లడ్ లైన్స్, షష్టిపూర్తి
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ట్ : హిట్ : ది థర్డ్ కేస్, కరాటే కిడ్ : లెజెండ్స్, భైరవం, ఘటికచలం, షష్టిపూర్తి
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సింగిల్, భైరవం
శ్రీరామ : ఖలేజా (2010)
రాజ్ : ఖలేజా (2010)
భరత్ కాంప్లెక్స్ : హిట్ : ది థర్డ్ కేస్, ఎక్స్ రోడ్స్, లవ్ కరూ యా షాదీ

పొగాకు.. ఆరోగ్యానికి పగాకు

- ధూమపానంతో పలు వ్యాధులు
- శరీరంలో పలు అవయవాలకు చేటు
- పెద్దాసుపత్రిలో డీ-అడిక్షన్ సెంటర్
- వ్యసనం మాన్పించేందుకు ఉచితంగా నికోటిన్ ప్యాచెస్
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం



కర్నూలు(హాస్పిటల్): పొగాకు మనిషి పాలిట పగబట్టే ఆకుగా మారింది. ఈ ఆకుతో తయారు చేసిన పదార్థాలను ఉపయోగించిన వారికి తాత్కాలిక ఆనందం కలుగుతుందేమో గానీ భవిష్యత్‌లో వారు జీవితాంతం నరకం అనుభవించేలా చేస్తుంది. ఈ విషయం తెలిసీ కొందరు, తెలియక చాలా మంది దీని భారిన పడుతున్నారు. తమ విలువైన జీవితా న్ని కోల్పోతున్నారు. పలు వ్యాధులకు గురై నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారు. పొగాకు వాడకాన్ని మాన్పించేందుకు గాను ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని నిర్వహిస్తున్నారు.

జిల్లాలో సంచార చికిత్స వాహనాల ద్వారా ఊళ్లోకి వెళ్లి వైద్యం చేస్తున్నారు. ఇందులో భాగంగా గతేడాది జూన్ నుంచి మే వరకు 424 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో 1,81,304 మందిని పరీక్షించి చికిత్స చేశారు. ఇందులోనే 283 మందికి నోటి క్యాన్సర్, 61 మందికి రొమ్ము క్యాన్సర్, 145 మంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితులు ఉన్నారు. వీరితో పాటు గత సంవత్సరం ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకం కింద ఆయా ఆసుపత్రుల్లో సర్జికల్ ఆంకాలజీలో 3,109 మంది, మెడికల్ ఆంకాలజీలో 3,214 మంది, రేడియేషన్ ఆంకాలజీలో 2,918 మంది చికిత్స తీసుకున్నారు. వీరిలో అధిక శాతం పొగాకు సేవనం వల్ల క్యాన్సర్ బారిన పడిన వారే ఉన్నారు. ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారిలో ఇలాంటి వ్యాధులు కనిపించేవి. ఇప్పుడు దురలవాట్ల కారణంగా చిన్న వయస్సులోనే క్యాన్సర్ బారిన పడుతున్నారు. కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌తో పాటు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, పలు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ క్యాన్సర్ వ్యాధికి గురై రోజూ 1500 నుంచి 2 వేల మంది దాకా చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో ముఖ్యంగా నోరు, గొంతు, అన్న వాహిక, కడుపు, ఊపిరితిత్తులు, మూత్ర వ్యవస్థలల్లో క్యాన్సర్లు ఉంటున్నాయి. పొగాకులో ఉండే పాలిసైక్లిన్ ఆటోమేటిక్ హైడ్రో కార్బైడ్స్, నైట్రోజన్ అమైన్స్, ఆటోమేటిక్ అమైన్స్ వంటివి క్యాన్సర్ కారకాలు, కాడ్మియం, క్రోమియం, ఇథిలిన్ ఆక్సైడ్, ఆర్సానిక్ వంటి దాదాపు 72 రకాల రసాయనాల వల్ల క్యాన్సర్ వస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జీజీహెచ్‌లో డీ అడిక్షన్ సెంటర్

నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా 2021 జనవరిలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మానసిక వ్యాధుల విభాగంలో టొబాకో సజెషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఒక సైకాలజిస్టు, ఇద్దరు సోషల్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారికి ఇక్కడ కౌన్సెలింగ్, బిహేవియర్ థెరపీ చేస్తూ మూడు నెలల పాటు అలవాట్లు మాన్పించేందుకు గాను నికోటిన్ ప్యాచెస్ అందజేస్తారు. ఏటా 300 నుంచి 400 మందికి ఇక్కడ చికిత్స, కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఇక్కడ అందించే నికోటిన్ ప్యాచెస్ అతికించడం వల్ల పొగ తాగాలి, పొగాకు నమలాలి అనే ఆలోచనను తగ్గిస్తుంది. వీటి వల్ల అనారోగ్య సమస్యల నుంచి బయటకు రావడానికి ఉపయోగపడతాయి.

పొగాకుకు ఇలా దూరం కావాలి

- పొగాకును ఒకేసారి మానకుండా రోజురోజుకు వాడకం తగ్గించుకుంటూ రావాలి.
- నికోటిన్ మాత్రలు, ప్యాచెస్ వాడితే పొగాకు మానాలన్న ఆలోచన వస్తుంది
- పొగాకు ఉత్పత్తుల నిషేధం విషయంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వమూ కఠినంగా నిర్ణయం తీసుకోవాలి.

మానితే ఇవీ ప్రయోజనాలు

- గుండె జబ్బులు, క్యాన్సర్, రక్తపోటు దూరం
- రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది
- రుచి, వాసన, గ్రహణశక్తి మెరుగుపడుతుంది
- త్వరగా అలసటకు గురిగాకుండా ఉంటారు. ఆయుష్షు పెరుగుతుంది

పొగాకు వల్ల క్యాన్సర్ ముప్పు



ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం దేశంలో ఏటా 13 లక్షల మరణాలు పొగాకు వినియోగం వల్ల కలుగుతున్నాయి. పొగాకు ఉత్పత్తులను పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ యువతరాన్ని పొగాకు అలవాటు దిశగా మారుస్తూ చివరికి బానిసగా మారుస్తున్నారు. ఈ సంవత్సరం ముఖ్య ఉద్దేశం పొగాకు ఉత్పత్తుల కంపెనీల 'చెడు ప్రచారాలను బహిర్గతం చేయడం, వారు అనుసరించే వివిధ మార్గాలను తెలుసుకోవడం'. కర్నూలు జిల్లాలో పొగాకు వాడకం వల్ల వచ్చే క్యాన్సర్లు మొదటి స్థానంలో ఉన్నాయి. ఇందులో నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, అన్నవాహిక, జీర్ణాశయం, పెద్దప్రేగు క్యాన్సర్లు అగ్రభాగాన నిలుస్తున్నాయి. అలాగే గుండెపోటు, రక్తపోటు, బ్రెయిన్ స్ట్రోక్, రక్తనాళాలు పూడుకుపోవడం, ఉబ్బసం, సీఓపీడీ, కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్నాయి. – **డాక్టర్ కె.శివప్రసాద్, మెడికల్ ఆంకాలజిస్టు, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, కర్నూలు**

నోటి క్యాన్సర్లు పెరుగుతున్నాయి



పొగాకు ఉత్పత్తుల వల్ల నోటి క్యాన్సర్ కేసులు ఇటీవల బాగా పెరిగిపోయాయి. స్మోకింగ్, గుట్కా, ఖైనీ వంటివి నమలడం వల్ల ముందుగా నోటిలో సబ్‌మ్యూకస్ ఫైబ్రోసిస్‌కు దారి తీస్తుంది. ఇది క్యాన్సర్‌కు ముందు దశ. అయినా పొగాకు వాడకం ఆపకపోతే నిదానంగా చర్మం వ్యాకోచించే స్థాయి నశించి పోతుంది. దీని వల్ల దవడ ఎక్కువ తెరవలేరు. ఆ తర్వాత నోటిలో పుండ్లు ఏర్పడటం, కొద్దిగా కారం తీసుకున్నా మండటం మొదలవుతుంది. ఇది క్రమంగా క్యాన్సర్‌కు దారి తీస్తుంది. దీంతో పాటు దూమపానం వల్ల ప్యాసివ్ స్మోకర్లు (పక్కన ఉండేవారు) కూడా పెరుగుతున్నారు. దీనివల్ల పొగాకు తాకపోయినా పక్కనున్న వారి ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయి. ఈ కారణంగా పొగాకుకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండటం మేలు.
–డాక్టర్ పి.సునీల్‌కుమార్‌రెడ్డి, నోరు, దంత వైద్యులు, కర్నూలు

డీఎఫ్‌ఓకు అదనపు బాధ్యతలు

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా అటవీ శాఖ అధికారి పి.శ్యామలకు అనంతపురం జిల్లా అటవీ శాఖ ఇన్‌చార్జ్ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం డీఎఫ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న విఘ్నేష్ అప్పవు వ్యక్తిగత కారణాలతో జూన్ 21వ తేదీ వరకు సెలవులో వెళ్లడంతో కర్నూలు డీఎఫ్‌ఓకు ఎఫ్ఏసీ ఇచ్చారు. ఆయన విధుల్లో చేరే వరకు శ్యామల అనంతపురం ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓ వ్యవహరించనున్నారు.

డిగ్రీ పరీక్షలకు 77 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు 77 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షలకు 571 మందికిగాను 494 మంది హాజరుకాగా 77 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

రేపు నృత్య ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జూన్ 1వ తేదీ సాయంత్రం 6 గంటలకు కూచిపూడి, శాస్త్రీయ, ఆధునిక నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ కో-ఆర్డినేటర్, డ్యాన్స్ మాస్టర్ కరీముల్లా తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకల సందర్భంగా నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

కారును ఢీకొన్న పాల వ్యాన్

ఆలూరు రూరల్: పట్టణంలోని గుంతకల్లు చెక్‌పోస్టు సమీపంలో ఆదోని-బళ్లారి హైవే 167లో శుక్రవా రం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు.. ఆదోని నుంచి బళ్లారికి వెళ్తున్న కారు ను, బళ్లారి వైపు నుంచి ఆలూరుకు వస్తున్న పాల వ్యాన్ ఢీకొట్టింది. కారులో ఉన్న వ్యక్తికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నిత్య సాధనతోనే క్రీడల్లో రాణింపు


ప్రతిభ చాటిన చిన్నారులకు మెడల్స్ అందజేస్తున్న పాస్టర్ ఫ్రెడీ పాల్

కర్నూలు (టౌన్): నిత్యం సాధన చేయడం వల్లే క్రీడల్లో రాణిస్తారని హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్ బ్రదర్ ఫ్రెడీ పాల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఈఎస్టీ (ఎవాంజలికల్ సోల్జర్స్ టీమ్) ఆధ్వర్యంలో వాలీబాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో సెలవులను వృథా చేయకుండా వాలీబాల్ క్రీడాంశంలో శిక్షణ తీసుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన చిన్నారులకు మెడల్స్, బహుమతులు అందజేశారు. ఈఎస్టీ డైరెక్టర్ దాసరి సుధీర్, కార్యదర్శి జయకర్, కోశాధికారి సురేష్ బాబు, మోజెస్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి


అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి టీజీ భరత్


కర్నూలు (హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆసుపత్రి, మున్సిపల్, హార్టికల్చర్ తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తెలియజేస్తే సీఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ స్థలాలను మెరుగుపరచాలని, అంతర్గత రోడ్లను బాగు చేయాలని సూచనలు చేశారు. సీటీ స్కాన్ యంత్రాలను ఉపయోగించుకోవాలని, అన్ని ఐసీయూలు, ఓటీలు వెంటిలేటర్లు వంటి క్లిష్టమైన పరికరాలలో యూపీఎస్/జనరేటర్/ఇన్వర్టర్ సౌకర్యం/కనెక్షన్ ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఏఈని నియమించాలని జెడ్పీ సీఈఓ, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈతో మాట్లాడారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే ఉచిత శిక్షణ


బి.యాదగిరిని సన్మానిస్తున్న అధ్యాపకులు

కర్నూలు సిటీ: విద్యార్థుల్లో ఆంగ్ల భాష పట్ల భయాన్ని పొగొట్టి ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసేలా పినాక ఉచిత శిక్షణ తరగతులు రూపొందించామని హైదరాబాద్ ఆదాయ పన్ను శాఖ అడిషనల్ కమిషనర్, ఐఆర్ఎస్ బి.యాదగిరి అన్నారు. ఎస్.ఆర్ పేటలోని శ్రీలక్ష్మీ హైస్కూల్‌లో పినాక ప్రజాసాధికార ట్రస్ట్ వ్యవస్థాపకుడు యాదగిరి, అమీలియో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ నేతృత్వంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన నిరుద్యోగ యువతకు స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, బ్యాంకింగ్, కెరీర్ గైడెన్స్, సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. 21 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా ఆయన రెండు రోజుల పాటు విద్యార్థులకు బోధన చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ తరగతులతో పాటు, ఉచిత స్టడీ మెటీరియల్, ఉచిత భోజన సదుపాయం, అమ్మాయిలకు హాస్టల్ వసతి సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ సీఈ మంజుల, స్కూల్ చైర్మన్ దీక్షిత్, కె.బలరాం, ఈశ్వరయ్య, పినాక అధ్యాపకురాలు సునీతారోజ్, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గార్గేయపురం రోడ్డు పనులు తక్షణమే చేపట్టాలి


రాస్తారోకో నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

ఓర్వకల్లు: జాతీయ రహదారి నుంచి పూడిచెర్ల, కేతవరం మీదుగా గార్గేయపురం వరకు అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం జాతీయ రహదారిపై గల పూడిచెర్ల మెట్ట వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి గుట్టపాడు వద్ద నిర్మిస్తున్న స్టీల్‌ప్లాంట్ పరిశ్రమకు గార్గేయపురం, కేతవరం, పూడిచెర్ల మీదుగా పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారన్నారు. అయితే ఏవిధమైన భూసేకరణ ప్రక్రియ చేపట్టకుండా, రైతుల ఆమోదం లేకుండా విచ్చలవిడిగా భూముల్లో గోతులు తవ్వడంతో అవి సాగుకు పనికిరాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకుడు నాగన్న మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా ఆరు నెలల క్రితం రోడ్డు నిర్మాణం ప్రారంభించి మళ్లీ వదిలేశారని, దీంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న ఎస్ఐ సునీల్ కుమార్ అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. శాంతించకపోవడంతో వారి మధ్య తోపులాట జరిగింది. తహసీల్దార్ విద్యాసాగర్ అక్కడి చేరుకొని పంచాయతీ రాజ్ ఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే పైపులైను పనుల ద్వారా నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొనడంతో ఆందోళనకారులు రాస్తారోకో విరమించారు. రైతు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసగించిన చంద్రబాబు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వర్గాల ప్రజలను సూపర్ సిక్స్ హామీలతో మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని బీఎస్‌పీ సిటీ కన్వీనర్ రాజ్‌కుమార్ విమర్శించారు. ఆయన శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి మోసం చేశారన్నారు. యువతకు ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని చెప్పారు. చదువుకున్న వారికి 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు అస్సలు పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ జూన్ 1వ తేదీన విజయవాడలో సదస్సును నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు.

నియామకం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలక వర్గాన్ని నియమిస్తూ కూటమి ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్స్-అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఈ మేరకు జీఓ ఆర్‌టీ నంబరు 368 జారీ చేశారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి నియమితులయ్యారు. చైర్మన్‌గా కురువ మల్లేష్, వైస్ చైర్మన్‌గా బోయ అంజని, సభ్యులుగా బండారి లక్ష్మి, బోయ ప్రభాకర్, బోయ రామచంద్రమ్మ, జే.అబ్రహం, గుర్రం కమ్మ కవిత, ఎం.దుబ్బన్న, కరణం సుదీర్, సూగూరు సాహిన్, తెలుగు శశికళ, బోయ వెంకటేశ్వరమ్మ, ఏ.ఫకృద్దీన్, కండె జయలక్ష్మి, కమ్మరి వెంకటేష్ ఆచారి నియమితులయ్యారు.

రైతు సంక్షేమం పట్టని ప్రభుత్వం

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వంలో రైతన్నకు భరోసా లేకుండా పోతోందని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తూరు సత్యనారాయణ గుప్తా ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తానని చెప్పి ఇంత వరకు పైసా ఇవ్వలేదన్నారు. అన్నదాతలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేందుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పెంచడం లేదన్నారు. దీంతో ఒకవైపు వర్షాలు కురిసి పంటలు వేసుకోవడానికి అనువైన వాతావరణం ఉన్నా సరైన విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయడానికి కర్షకులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే 90 శాతం సబ్సిడీతో ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులను చేపట్టాలని, గుండ్రేవులను నిర్మిస్తే కరువు రైతుకు ఎంతో భరోసా లభిస్తుందన్నారు. అయినా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం విచాకరమన్నారు.

డ్రగ్స్ వల్ల కుటుంబాలు సర్వనాశనం


అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈగల్ సెల్ ఇన్‌చార్జ్ తదితరులు

కర్నూలు (టౌన్): డ్రగ్స్ వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం సర్వనాశనం అవుతుందని రాయలసీమ ఈగల్ సెల్స్ ఇన్‌చార్జ్ రాంబాబు, మూడో పట్టణ సీఐ నాగశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక బి.క్యాంప్‌లోని స్కందాన్షి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రగ్స్ స్వల్ప వినియోగంతో ప్రారంభమై కాలక్రమేణా ఆరోగ్యాన్ని, వ్యక్తిత్వాన్ని, జీవితాన్నే నాశనం చేసే స్థితికి తీసుకెళ్తుందన్నారు. డ్రగ్స్ వాడటం వల్ల మానసిక ఆందోళన, డిప్రెషన్, ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వ్యాయామం, ధ్యానం వంటి మంచి అలవాట్లతో ఒత్తిడిని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. అంతకుముందు 'నేను ఎటువంటి డ్రగ్స్ వాడను.. నా కుటుంబం కోసం నేను ఆరోగ్యంగా ఉండేందుకు వాటికి దూరంగా ఉంటాను' అని అక్కడున్న మార్కెటింగ్, అకౌంటింగ్, ఇంజినీర్లు, అన్‌స్కిల్డ్ ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ డీఎస్పీ రాజశేఖర్ గౌడ్, ఈగల్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఒలింపిక్ అసోసియేషన్ సమావేశం

కర్నూలు (టౌన్): స్థానిక కర్నూలు ఆఫీసర్స్ క్లబ్‌లో జూన్ 1న ఉదయం 10 గంటలకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు బొల్లవరం రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలపై చర్చ, సేవా కార్యక్రమాలు, ఒలింపిక్ డే సెలబ్రేషన్స్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు.

తాగునీటిని వృథా చేస్తే కొళాయి కనెక్షన్ కట్


ప్రకాష్ నగర్‌లో కొళాయి కనెక్షన్‌ను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కర్నూలు (టౌన్): నగర వాసులు తాగునీటిని ఇంటి అవసరాల కోసం కాకుండా ఇతరత్రా వాటికి వాడుకుంటే సంబంధిత కొళాయి కనెక్షన్లను తొలగిస్తామ ని నగరపాలక కమిషనర్ హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని వివిధ కాలనీలలో కమిషనర్ తనిఖీలు నిర్వహించారు. స్థానిక ప్రకాష్ నగర్, సంకల్‌బాగ్, ధర్మపేట, బిర్లా కాంపౌండ్‌లో తాగునీటిని వృథా చేస్తున్నట్లు గుర్తించిన కమిషనర్ సంబంధిత డీఈ మనోహర్ రెడ్డిని ఆయా ఇళ్ల కొళాయి కనెక్షన్లను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజల తాగునీటి కోసం నగరపాలక సంస్థ లక్షలాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. ఎంతో వ్యయంతో నీటిని శుద్ధి చేసి ప్రజల తాగునీటి అవసరాలు తీరుస్తుంటే వృథా చేయడం తగదన్నారు. నీటిని ఇంటి అవసరాలకు వినియోగించుకోకుండా వాహనాలను, రహదారులను శుభ్రం చేయడం, గార్డెనింగ్ పనులకు వాడుకోవడం మంచిది కాదన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు మూడు ఇళ్లకు కొళాయి కనెక్షన్లను తొలగించారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం

కర్నూలు(సెంట్రల్): కార్మికుల హక్కుల కోసం మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావాన్ని పురస్కరించుకొని న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో కార్మిక, కర్షక భవన్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పీఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. 1970 మే 30న సీఐటీయూ ఆవిర్భావించి ఐక్య పోరాటాలకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్మికుల భద్రత కోసం పీఎఫ్, ఈఎస్ఐ, వేతన సవరణ చట్టాల కోసం పట్టుబట్టి సాధించిన అతి పెద్ద కార్మిక సంఘం సీఐటీయూ అని కొనియాడారు. కార్మికుల రక్షణ కోసం అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. నాయకులు టి.రాముడు, ఆర్.నరసింహులు, విజయుడు, బతుకన్న, ఎం.మల్లికార్జున, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

మంత్రాలయం రూరల్ : రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఓ రైతు దుర్మరణం చెందారు. వివరాలు..మండలంలోని చెట్నెహళ్లి గ్రామానికి చెందిన కురువ రాముడు (60) పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో మనవడితో కలిసి బైక్‌పై ఇంటికి బయలు దేరాడు. పొలం రస్తా నుంచి జాతీయ రహదారిపైకి వస్తుండగా మంత్రాలయం నుంచి బైక్‌పై వేగంగా వస్తున్న పాండురంగ, జొల్లు రఘు ఢీకొట్టారు. దీంతో రాముడు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న భార్య లక్ష్మి, కుమారులు మల్లారెడ్డి, మోలార్‌లింగ సంఘటన స్థలానికి చేరుకుని ఇంటి పెద్దదిక్కు విగతజీవిగా పడిఉండటాన్ని చూసి బోరున విలపించారు. అలాగే మంత్రాలయం నుంచి వస్తున్న రాంపురం గ్రామానికి చెందిన పాండురంగ తలకు గాయమైంది. ఆదోనికి చెందిన జొల్లు రఘు స్వల్పంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ నారాయణ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి పెద్ద కుమారుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహానికి ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి. భీమారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.